మనిషి చెడిపోవడానికి ఎన్నెన్ని అలవాట్లు అవసరమో అన్నీ సాధించాడు మార్కండేయులు- తన ఇరవయ్యో సంవత్సరానికే. అయితే అతని అదృష్టం ఏమిటంటే అది చెడిపోవడమని అతను భావించలేదు, వాళ్ళ నాన్న భావించాడు.

ఇంటర్మీడియట్ లో రెండు సబ్జెక్టుల్లో సున్నా లెందు కొచ్చాయని వాళ్ళనాన్న అడిగాడు. "నీ కొడుకు నయాను కనుక" అన్నాడు మార్కండేయులు. చెళ్ళున చెంపమీద కొట్టాడు వాళ్ళ నాన్న. అది సాధారణంగా సాధ్యపడే పనికాదు.

# పొగచెట్టు

## గొల్లపూడి మారుతీరావు

వాళ్ళ నాన్నమీద సులువుగా ఓ అడుగున్నర ఎత్తుంటాడు మార్కండేయులు. అయినా ఆ కోశంలో ఎగిరి కొట్టాడు నాన్న. ఉద్రేకంతో ఎగిరిపడ్డాడు. ఇద్దరూ తిట్టుకున్నారు. కొడుకు యింట్లోంచి బయటికి వచ్చేశాడు. అయితే ఈ వివాదంలో యిద్దరూ ఒక వ్యక్తిని మరిచిపోయారు. మార్కండేయులు కన్నతల్లి ఆవిడకి ఆ రాత్రే గుండెనొప్పి వచ్చింది. ఆ విషయం తెలియడానికి ఆరునెలలు పట్టింది మార్కండేయులుకి.

ఇలా కథ మొదలెట్టినప్పుడు మార్కండేయులు దుర్మార్గుడనీ. వాళ్ళ నాన్న సరైన పనే చేశాడనీ— యిలాంటి ఆలోచనలు మీకు రావడం సహజం. కాని మార్కండేయులు నాన్న కాపుసారా అనర్గళంగా తాగేవాడు. తాగి వయొలిన్ అద్భుతంగా వాయించేవాడు ఆయన రోజుల్లో గొప్ప విద్వాంసుడు. అయితే వయొలిన్‌లో మాధుర్యం కంటే కాపుసారా వాసన సామాజికుల్ని హింసపెట్టడంతో కచ్చేరీలు రావడం మానేశాయి అందుకు ముసలాయనా విచారించలేదు. రెండుపూటలా తాగడానికి సరిపోయే ఆస్తి వుంది. ఆరుగురు కొడుకులూ. ముగ్గురు కూతుళ్ళూ వున్నారు తెలివైన భార్య వుంది కనుక యింటి విషయం పట్టించుకోవడం మానేశాడు మార్కండేయులు ఆ యింటికి ఆరో కొడుకు తల్లి పట్టుదల. తండ్రి వ్యసనాలూ - ఒకటి పుట్టుకవల్లా. రెండోది పరిసరాలవల్లా అలవాటు చేసుకొని పరాకాష్ఠ సాధించాడు

సంక్రాంతి వెళ్ళిన కనుమునాడు యింటిల్లిపాదీ మధ్య చావిట్లో చేరడం. గంపెడు గారెలూ, పళ్ళెంలో కూరా పెట్టుకొని ఉమ్మడిగా భోజనం చెయ్యడం కుటుంబం ఆనవాయితీ ఉదయమే అలవాటుగా తాగి వచ్చాడు ముసలాయన ప్రత్యేకంగా తాగి వచ్చాడు మార్కండేయులు. పసారాలో తండ్రీ. కొడుకూ దెబ్బలాడుకొన్నారు.

"లంజాకొడకా ! పదిమంది ముందూ తాగుతావా ?" అన్నాడు ముసలాయన.

"నువ్వు తాగితే అమృతం. నేను తాగితే సారా అవుతుందా ?" అన్నాడు కొడుకు. "నీకే నీతి లేనప్పుడు. నాకులేదని ఎవ్వరూ బాధపడరులే" అన్నాడు ముసలాయన సింహం. ఆ రోజునే చిన్నకొడుకు నడుం విరిగిపోతుందని భయపడింది తల్లి కాని ఒక్క క్షణం నిశ్శబ్దమయిపోయాడు ముసలాయన అంతలో మార్కండేయులు రెక్క పట్టుకొని వెలిసిపోయిన ఓ పటం దగ్గరికి తీసుకొచ్చి దాన్ని చేత్తో తుడిచాడు.

"ఒరేయ్- రోజూ దీనికి దండం పెట్టిందే పొద్దుటయినా సారా ముట్టుకోను. అది ఎవరి పటమో తెలుసా! త్యాగరాజస్వామి పటం ఆయన మీద ప్రమాణం చేస్తున్నానురా. ఇంక జన్మలో సారా ముట్టనురా" అన్నాడు అంతా నివ్వెరపోయారు అంతే తర్వాత ముసలాయన సునాయాసంగా మరో ఏభై ఏళ్ళు బతికాడు కాని చివరి రోజుల్లో ఉబ్బసం ఎక్కువయి డాక్టరు బ్రాందీ తీసుకోవడం మంచిదన్నా చస్తే ముట్టుకోలేదు. కాని మార్కండేయులు మానలేదు ఎందుకంటే అతను ఎవరికీ ప్రతిజ్ఞ చెయ్యలేదు కనుక. ఈ సందర్భం చెప్పినప్పుడు మీకు ముసలాయన మీద సదభిప్రాయం కలగాలని నా ఉద్దేశం కాదు. మార్కండేయులు పట్టుదల వారసత్వం అని చెప్పడానికి.

ప్రవర్తన భయంకరమైన విశ్వాసం. తను చేసే మంచి పనులకి ఎంత నమ్మకం కావాలో. తను బతికే చెడు జీవితంలోనూ సుఖం దృష్ట్యానో. అనివార్యత దృష్ట్యానో. తిరుగుబాటు దృష్ట్యానో అంతే బలమైన నమ్మకం వుండాలి. కాని మార్కండేయులు ఈ విశ్వాసాన్ని జీవితంలో అతి విచిత్రంగా మార్చుకొనే సందర్భం వచ్చింది. అది చెప్పడానికే ఈ ప్రయత్నం

వాళ్ళ నాన్న చెంపదెబ్బ కొట్టి ఇంట్లోంచి పొమ్మన్నప్పుడు ఆనందంగా బయటికి నడిచాడు మార్కండేయులు. మురికిపట్టి. మాసిపోయిన చొక్కావంటి పాత వారసత్వాన్ని వదలి. తనదైన వ్యక్తిత్వాన్ని వెదుక్కొనే అవకాశం వచ్చినందుకు ఆనందించాడు. అప్పటికి అతని వంటిమీద వాళ్ళ నాన్న ఆదాయంతోనే కొన్న మాసిపోయిన పాతచొక్కా. వాళ్ళ అమ్మ ఆ మధ్యాహ్నం చక్కెర కొనమని యిచ్చిన పదిహేను రూపాయలు ఉన్నాయి మార్కండేయులు సరాసరి తమ్మారాయుడు అనే తన ఉంపుడుకత్తె యింటికి వచ్చాడు. తమ్మారాయుడికి మార్కండేయులు ఆషక్కు. బయట నులక మంచం వేసి పడుకోమంది- రెంటచింతలనుంచి పెద్ద వెంకట్రామయ్య




గారు వచ్చారంటూ. నులక మంచంమీద నక్షత్రాలు లెక్కబెడుతూ పడుకున్నాడు. తమ్మారాయుడు యింటికి యెప్పుడు వచ్చినా వరండాలో పడుకోవలసిన అవసరం రాలేదు. అది పతివ్రతకాదు. తనకి తెలుసు. ఏ ముసుగూ లేకుండా ఒకరి జీవితాల్ని, అవసరాల్ని, బలహీనతల్ని అంగీకరించాకనే వాళ్ళిద్దరూ ప్రత్యేకంగా దగ్గరయారు. వెంకట్రాజుగారు తొలికోడి కూసేవేళకి లేచి వెళ్ళాడు. అప్పుడు తమ్మారాయుడు అతని మంచం పక్కకి వచ్చి కూర్చుంది.

"చెప్పకుండా వస్తే ఎలా? కోపం వచ్చిందా?" అంది మార్కండేయులు నిద్రపోవడం లేదని తెలుసుకొని.

"ఏడిశావులే. ఇక నుంచీ రావడం వుండదు. ఇక్కడ నుంచి వెళ్ళడమే-" అంటూ జరిగిందంతా చెప్పాడు. తమ్మారాయుడు పగలబడి నవ్వి "ముసలాడు కొట్టే ఎత్తుకి ఎగిరాడన్నమాట మరేం పరవాలేదు. ఇక్కడే వుండు. నా సంపాదన చాలు మనిద్దరికీ" అంది చాలా మనస్ఫూర్తిగా చాచి లెంపకాయ కొట్టాడు మార్కండేయులు. ఆ వేళ్ళు పెదాలకి తగిలి రక్తం చిమ్మింది. ఎక్కడో మగాడి 'అహం' మీద దెబ్బ తగిలింది. రెచ్చాడు. తమ్మారాయుడికి కోపంరాలేదు. కొంగుతో రక్తం తుడుచుకొని "నువ్వంటే ప్రాణం. ఆమాత్రం ప్రేమ చూపించకూడదా?— పోనీలే. అలవాటులేని పనిచేశాను. దెబ్బ తిన్నాను." అంది. తమ్మారాయుడిని మనసారా కావలించుకొని భోరుమన్నాడు మార్కండేయులు. తనకి ఎవరో అదునుగా ఉండాలన్న జ్ఞాపకం ఆమె స్ఫురణకు తెచ్చింది.

రెండు మూడు రోజులు పిచ్చిగా ఊరంతా తిరిగాడు. డబ్బుకి యిబ్బంది పడతాడేమోనని చెప్పి రోజూ యిరవై రూపాయలు జేబులో పెట్టేది తమ్మారాయుడు ఇలా ఇరవై నాలుగ్గంటలూ తనతోనే. తన యింట్లోనే వుండే మనిషి తమ్మారాయుడికి కొత్త. విశ్వాసం, స్వామిభక్తి ఆ జీవితాలకి మొహం మొత్తిన పదాలు. కాగా మార్కండేయులు నిప్పు. అతన్ని మూడో ఝామున రెండు మూడు గంటలు మాత్రమే భరించగలదు. నాలుగు రోజులయేసరికి తమ్మారాయుడు విసిగింది. అయిదోరోజు సాయంకాలం బయటికి వెళ్ళిన మార్కండేయులు తిరిగి రాలేదు. తమ్మారాయుడు నిట్టూర్చింది. అనుమానం లేదు- మార్కండేయులంటే ఆమెకి వల్లమాలిన ప్రేమ. ఆ కారణానికే అతను వెళ్ళిపోయినందుకు ఆనందించింది. మార్కండేయులు ఆత్మహత్య చేసుకోడు. బతకడం తెలుసు. నలుగురిని కొట్టి తనకి కావలసిన డబ్బు సంపాదించుకోగలడు. మళ్ళీ కనిపిస్తే యిదివరకటి పొగరుతో మూడోఝామున యథాప్రకారంగా, యథాలాభంగా తన ముంగిట్లో అడుగు పెడతాడని ఆమెకి తెలుసు.

మార్కండేయులు సరాసరి విశాఖపట్నం వచ్చాడు తనకి కాలేజీలో వరదాచారి అనే స్నేహితుడుండేవాడు. అతనిప్పుడు యూనివర్సిటీలో చదువుతున్నాడు. అతని రూంకి సరాసరి వచ్చాడు. భవిష్యత్తులో ఏం చెయ్యాలి? చదవాలా? ఉద్యోగం చెయ్యాలా? యిలాంటి ప్రశ్న

లకు వెంటనే సమాధానాలు దొరకలేదు సంగతి విని తండ్రిని ఎదిరించి వచ్చినందుకు వరదాచారి తిట్టాడు. మార్కండేయులుకు నవ్వొచ్చింది. హైస్కూలు రోజులనుంచీ వరదాచారి అతని చేతుల్లో అలవాటుగా దావుదెబ్బలు తినేవాడు. తనకి లేకపోయినా దెబ్బలు తప్పించుకోదానికి వరదాచారి తప్పనిసరిగా మార్కండేయులుకి డబ్బులు తెచ్చి యిచ్చేవాడు. అలాంటివి తనని తిట్టే పరిస్థితి! "నీతి సత్ప్రవర్తనలో ఉండే జబ్బు యిదే!" అనుకొన్నాడు మార్కండేయులు

వరదాచారి చుట్టలు కాలుస్తాడు. చుట్టలంటే పరమ అసహ్యం మార్కండేయులుకి కాని తమ్మారాయుడు గదిలో వెంకట్రాజుగారిని అంగీకరించినట్టే, వరదాచారి చుట్టల అలవాటునీ తప్పనిసరిగా అంగీకరించవలసివచ్చింది.

"నీ చదువు యిప్పట్లో సాగేదికాదు కానీ. నా గదిలో పడి వుండరా మార్కా! తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు వారం రోజులు వున్నాడు. విసుగుపుట్టింది. మనిషిలో చపలత్వం ప్రారంభమయిందని వరదాచారి కూడా కనిపెట్టాడు. అంతవరకూ తన సమర్థతని నిరూపించుకోవలసిన అవసరం లేకపోయింది మార్కుకి. కాని తండ్రి 'నువ్వు అసమర్థుడివి' అంటూ తగిలేశాక. తన సమర్థతని నిరూపించుకోవాలనే తపన యెక్కువయింది. చిన్నతనంనుంచీ తన తెలివితేటల్ని రౌడీ పనులకి, మందుకీ, విచ్చలవిడి తిరుగుళ్ళకి ఖర్చుపేసినవాడు మార్కు. ఈ జీవితంలోంచి "ప్రయోజకత్వం" ఎలా వస్తుంది? ఈ అనుభవం తన సమర్థతని ఎలా నిరూపిస్తుంది? గడిచిన గతంమీద వెగటు పుట్టలేదు ఈ పరిస్థితిని సృష్టించిన వాళ్ళ నాన్న మీదపడి పీకనొక్కి చంపేయాలనిపించింది. మనిషిలో ఉద్విగ్నత. చెప్పరాని ఆవేశం పెరిగే రోజుల్లోనే వరదాచారి "మార్కూ! రేపు ఖర్గపూర్ వెళ్తున్నాం" అన్నాడు. ఎందుకని అడగలేదు మార్కు - ఇక్కడ నుంచి వెళ్ళాలి. ఎందుకు వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళాలి? వెళ్ళి ఏం చెయ్యాలి? మనిషి కదలిక కూడా అభివృద్ధే అని భావించే స్థితిలో ఉన్నాడు మార్కు. వెంటనే ప్రయాణమయాడు.

వరదాచారి అక్కయ్య ఖర్గపూర్‌లో వుంది బావ అక్కడే రైల్వేలో పని చేస్తున్నాడు. మేనల్లుడు పుట్టాడని ఉత్తరం ఖర్గపూర్‌లో దిగాక కాని. అక్కయింట్లో సదాచారం చూశాక కాని. అజామీళుడులాంటి మార్కుని తీసుకొచ్చిన భయం స్ఫురణకి రాలేదు వరదాచారికి "ఒరేయ్ మార్కూ! ఇక్కడ నా పరువుతీసెయ్యకు. మందు కావాలంటే బయట ఎక్కడయినా కానియ్. నీ వ్యవహారాలు తెలిశాయా, మా అక్క నాన్నకి రాస్తుంది. నాకు గుండు చేయించేస్తాడు" అని బతిమాలాడు. కాళ్ళమీదపడే మనుషులంటే పరదా మార్కుకి. వాళ్ళకోసం యెలాంటి త్యాగమయినా చెయ్యడం అతనికి అలవాటు. "అలాగే పో" అన్నాడు.

కాని వచ్చిన నాలుగు రోజులకి అనుకోని ప్రమాదం వచ్చి పడింది. వరదాచారి బావ నరసింహాచారి. కుసుమ హరనాథ్ బాబా భక్తుడు. అక్కడికి పన్నెండు మైళ్ళలో బాబా సతీమణి ఠాకూర్‌రాణీ ఆశ్రమంవుంది. ఆ ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు వరదాచారినీ మార్కునీ. వెళ్ళవలసివచ్చినందుకే వణికిపోయాడు వరదాచారి ఇన్నాళ్ళు మార్కండేయులు జేబులో తన చుట్టలు దాచి మధ్య మధ్య కాలుస్తున్నాడు. కాగా ఖర్గపూర్‌లోనే మార్కు సమస్య అయిపోతే. ఠాకూర్‌రాణీ సమక్షంలో ఏమవుతాడు!

విచిత్రంగా ఏమీ కాలేదు. జీవితంలో నమ్మిందిచేస్తూ. చేసిందానికి గర్వపడుతూ. ఈసడించే వాళ్ళని చావగొడుతూ ఆనందంగా గుండెల మీద చెయ్యి వేసుకు నిద్రపోయే మార్కండేయులుకి- ఓ పెద్ద అవ్యవస్థలో మనస్సు ఇరుక్కొన్న మార్కండేయులుకి- ఆ ఆశ్రమం పెద్ద 'షాక్' లాగ కనిపించింది. మతం, మంచితనం, దేవుడు, దెయ్యం లాంటివి పూనుకుని ఆలోచించని మామూలు మనిషి ఆ నిరాడంబరమయిన వాతావరణంలోకి వచ్చేసరికి బిత్తరపోయాడు.

ఠాకూర్‌రాణీ మరీ వృద్ధురాలు. ఆమె భాష మార్కుకి తెలీదు. వరదాచారికి తెలీదు. కాని అతని బావ. అక్క బెంగాలీలో మాట్లాడుతున్నారు. అందరివెనకా వరదాచారి. మార్కు నిలబడ్డారు. వాళ్ళతో పాటు మరో పదిమంది వున్నారు. సాలార్ జంగ్ మ్యూజియమ్‌లోకి వచ్చిన ఏలూరు రైతులాగ దిక్కులుచూస్తూ ఆ గదిలో నిలబడ్డాడు మార్కు. భక్తులందరినీ పలకరిస్తోంది ఠాకూర్‌రాణీ ఉన్నట్టుండి మార్కుని బుజంతో పొడిచాడు. ఆమె చిరునవ్వుతో మార్కునే గమనిస్తోంది. ఏదో అడిగింది- అర్థంకాలేదు "మీవాడి పేరేమిటిరా చెప్పు!" అన్నాడు నరసింహాచారి బావతో.

"మార్కు. అదే మార్కండేయులు"

విభూతి అతని చేతుల్లో వేసింది. ఆశ్చర్యపోతూ అందుకొన్నాడు మార్కు. దాన్ని ఏం చెయ్యాలో తెలీదు. వరదాచారి చేతిలో వేశాడు కాని ఆ వృద్ధురాలి ముఖంలో చెప్పలేని తేజస్సుని అబ్బురపాటుతో గమనిస్తూ నిలబడ్డాడు. ఆమె నెమ్మదిగా ఏదో మాట్లాడుతోంది. రెండు మూడుసార్లు తనవేపే చూస్తోంది. ఆమె మాట్లాడడం అయాక ఒక్కొక్కరే వెళ్ళి ఆమె పాదాలకు నమస్కరిస్తున్నారు. మార్కు బయటకు నడవబోయాడు. వరదాచారి రెక్కబట్టుకు ఆపాడు. తెల్లగా, దంతం బొమ్మలాగ వున్న ఆ కాళ్ళదగ్గరికి వచ్చేకొద్దీ మార్కుకి భయంవేసింది తన జీవితంలో మురికి. తనబతుకులో నిర్లక్ష్యం ఏనాడూ ఈ వాతావరణం గురించికానీ. యిటువంటి భక్తి గురించికానీ ఆలోచించని అలసత్వం. అన్నీ గుర్తుకొచ్చాయి. ఆఖరికి ఆమె పాదాలను సమీపించేసరికి నిస్సహాయంగా కళ్ళనీళ్ళు వచ్చాయి ఆ పాదాలు ముట్టుకోడానికే భయమేసింది. వరదాచారి ప్రోత్సహించాడు. వెన్నెలలాంటి ఠాకూర్‌రాణీ నవ్వు ప్రోత్సహించింది పాలరాయిలాగ చల్లగావున్న ఆ పాదాల్ని తాకాడు. ఆ క్షణంలో భోరున దుఃఖం వచ్చింది- బయటికి పరిగెత్తుకుపోయాడు మార్కండేయులు.

మరో అరగంటకి వరదాచారి మార్కుకోసం ఆశ్రమమంతా వెదుకులాడాడు. దూరంగా మామిడి చెట్టుకింద కూర్చుని వున్నాడు. వరదాచారి దగ్గరికి వచ్చి "ఏం గురూ! మా అందరికంటే భక్తి ఎక్కువయినట్టుందే!" అన్నాడు. నవ్వుతూ చొక్కా బలంగా పట్టుకుని గుంజి "లంజకొడకా! మళ్ళీ యిలాంటి చోటుకి తీసుకొచ్చావంటే చంపుతా. ఇదంతా చికాకుగా వుంది పోదాం పద" అన్నాడు మార్కు. వరదాచారి ఆశ్చర్యపోయాడు. "సరేలే భోజనం చేసిపోదాం" అన్నాడు.



భోజనానికి పిలుపు వచ్చింది. నూతి దగ్గరికి కాళ్ళు కడుక్కోడానికి నడిచాడు మార్కు. మనసంతా యెందుకో కలచి పట్టుంది బాల్చీతో నీళ్ళతోడి అందరి కంటే ఆలశ్యంగా కాళ్ళు కడిగాడు ఎవరో పిలిచినట్టయి తలెత్తాడు. దూరంగా ఆశ్రమం హాలు ద్వారం దగ్గర నిలబడి తనని రమ్మని ఆహ్వానిస్తోంది ఠాకూర్ రాణీ అటుచూసి స్తంభించిపోయాడు. ఒక్కక్షణం ఆమె బంగారు కిరీటంతో. పట్టు చీరెతో ధగధగా మెరిసిపోయే నగలతో మహారాణీలాగ కాదు- దేవీ స్వరూపంగా కనిపించింది విభ్రాంతపోయాడు. అంతా క్షణకాలం. మళ్ళీ అంతలో చల్లటి నవ్వు నవ్వే వృద్ధురాలు. కాళ్ళు కడుక్కొని వచ్చి. హాల్లో పీటమీద కూర్చున్నాడు- ఠాకూర్ రాణీ వెదుక్కుని వచ్చినట్టు మార్కు పక్కనే పీట వేయించుకు కూర్చుంది భాష రాదు. వడ్డించే వాళ్ళతో ఏదో చెప్పి మరీ మరీ వడ్డింపమంది. భోజనం సరిగ్గా చెయ్యలేక పోయాడు మార్కు. ఇదంతా విచిత్రంగానూ ఇబ్బందిగా భయం భయంగా వుంది.

మరునాడు మధ్యాహ్నం ప్రయాణం. ముందురోజు రాత్రి కలతగా నిద్రపోయాడు మార్కు. ప్రయాణం దగ్గరపడుతూంటే ఉత్సాహంగా సామాన్లు సర్దుకున్నాడు. బయలుదేరే ముందు మళ్ళా అంతా ఠాకూర్ రాణీ సమక్షంలోకి వచ్చారు మరీ దూరంగా గేటు దగ్గర నిలబడ్డాడు మార్కండేయులు అందరినీ సాదరంగా పలకరించింది ఆవిడ కొందరిని చూస్తూ "మీరేం చేస్తున్నారు" అనడుగుతోంది. చెప్తున్నారు వరదాచారి చదువుకొంటున్నానన్నాడు ఉన్నట్టుండి గుమ్మం వేపు చూసి "ఆయనేం చేస్తున్నారు" అంది. వరదాచారి మార్కుని ఈడ్చుకొచ్చాడు ఆమె సమక్షంలోకి మార్కండేయులు దృష్టిని తప్పించుకున్నాడు ఒక్కొక్కరు ముందుకువచ్చి ఆమెతో మాట్లాడాలని హడావుడిపడుతున్నారు. మళ్ళీ మార్కుని చూసి "ఆయనేం చేస్తున్నారు?" అడిగింది. మార్కు తడువుకొన్నాడు చేతులు వణికాయి. జేబుల్లో చేతులు పెట్టుకున్నాడు. అందరూ బయటికి నడిచారు. మార్కు అందరికంటే ముందు నడిచాడు. బండి ఎక్కబోయే ముందు— మళ్ళీ మార్కుని చూసి "ఆయన ఏం చేస్తున్నారు!" అంది ఠాకూర్ రాణీ. వరదాచారి తిట్టాడు. "నోరిప్పి ఏడువ్" అన్నాడు కసురుకుంటూ. ఏం చెప్పాలో. ఎలా చెప్పాలో తోచలేదు. అక్కడున్న అందరి చూపూ మార్కండేయులుమీద నిలిచింది. ఇబ్బందిపడిపోయాడు. అంతా నిశ్శబ్దం జేబులో చేతికి చుట్టలు తగులుతున్నాయి ఒక్కక్షణం ఆలోచించి చటుక్కున అన్నాడు. "చుట్టలు. చుట్టల వ్యాపారం" ఠాకూర్ రాణీ నవ్వింది. ప్రశాంతంగా నవ్వింది. "మంచిదే" అంది బండి కదిలింది

విశాఖపట్నం వస్తూనే ఆ విషయం మరిచిపోయాడు మార్కండేయులు. ఏలూరులో మరొక స్నేహితుడి దగ్గరికి వెళ్ళాడు ఎంతైనా చదువుకొన్న ఘటం. చిల్లరగా తిరిగిన మనిషి. ఏ వ్యాపారం వేపూ మనస్సు మొగ్గలేదు. ఓ సివిల్ కాంట్రాక్టరుకి బ్రోకరుగా పనిచేసి డబ్బులు సంపాదించాడు జల్సాగానే బతికేశాడు. సాయంకాలమయేసరికి పూలరంగడిలాగ గడిచిపోయేది. కాని యిదివరకటి ఉత్సాహం కాస్త తగ్గింది. కొన్నాళ్ళు కేవలం పశుబలంతో ఏమీ కారణం లేకుండా డబ్బున్నవాళ్ళని తన్ని వాళ్ళ దగ్గర డబ్బు తీసుకొని బతికాడు. అలా బతకడంలో కూడా క్రమంగా విసుగుపుట్టింది. ఈ పనులన్నీ యిదివరకులాగ 'కసి'తో చెయ్యలేకపోయాడు. ఆ రోజుల్లోనే నిడదవోలులో మాచిన్నాయన రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూంటే. ఒక్కసారి వెళ్ళి కలుసుకోమన్నాను. గవర్నమెంటు ఉద్యోగంలో చచ్చేట్టు సంపాదించాడు మా చిన్నాయన. మార్కండేయులుకి తన అవినీతితో ఏదయినా ఉద్యోగం సంపాదించిపెట్టడా అని నా ఆశ. మార్కండేయులుకి ఉత్తరం రాశాక ఆ విషయం మరిచిపోయాను.

నాలుగయిదేళ్ళు గడిచాక ఈ మధ్య ఏదో పనిమీద విజయనగరం వెళ్ళినప్పుడు మార్కండేయులు కనిపించాడు. ఖద్దరు లాల్చి. పంచెకట్టి మీసాలు బొద్దుగాపెంచి. హాయిగా. ఆనందంగా కనిపించాడు. జీవితమంతా దుర్మార్గంగా బతికినందువల్ల మంచి బతుకుమీద వ్యామోహంతోనో లేక దుర్మార్గం బతుకుకి మరో రూపంగానో ఖద్దరు కట్టాలని బుద్ధిపుట్టినట్టుంది. ఏమైనా పెద్దమనిషిలాగ కనిపించాడు. నుదుటికి చిన్న బొట్టు. జుత్తురాలి క్రాఫింగు మీదకిపోయింది. ఎప్పుడూ లేనిది నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే. చుట్ట కాలుస్తున్నాడు. "ఏంరా! యిప్పుడేం చేస్తున్నావు?" అన్నాను

సమాధానం విని దిమ్మరపోయాను.

"ఇక్కడే చుట్టల వ్యాపారం చేస్తున్నానన్నాడు."

నాకు నోట మాట రాలేదు మార్కండేయులు వ్యాపారంచేస్తూ కుదురుగా ఒకచోట కూర్చుంటాడనీ. తన సరసతతో కస్టమర్స్‌ని ఆహ్వానించగలడనీ. అందులోనూ చుట్టల వ్యాపారం చేస్తాడనీ ఎలా వూహించగలను?

"ఈ వ్యాపారం ఎలా కుదిరింది?" అన్నాను విభ్రాంతపోతూ.

"మీ చిన్నాయన పెట్టిన భిక్ష" అన్నాడు

"ఎలా?" అన్నాను అర్థంగాక. మా చిన్నాయన చుట్టలు కాల్చడు. అలాంటిది ఆయన ద్వారా ఈ వ్యాపారం ఎలా సాధ్యపడింది? అప్పుడు చెప్పుకొచ్చాడు మా చిన్నాయన మొదట కసిరికొట్టాడట. మర్నాడు రమ్మన్నాడట. వెళ్ళాడట. అయిదు రోజుల తర్వాత రమ్మన్నాడట. వెళ్ళాడట. పదిహేను రోజుల తర్వాత రమ్మన్నాడట. వెళ్ళాడట. గుమ్మంలో శవం వుందట చిన్నాయన మావగారు పోయారు. కాస్త యిబ్బందిపడి పక్కన నిలబడ్డాడట మార్కండేయులు. చిన్నాయన యెవరితోనో మాట్లాడుతూ "పోతే పోయాడయ్యా. పొగాకు కావాలని నా దుంప తెంచాడు. మా వాళ్ళందరికీ చెప్పి అక్కడా యిక్కడా పది వీశెలు తెప్పించాను. ఒక్క కాడయినా కాల్చకుండా నన్ను కాల్చుకు తినిపోయాడు" అన్నాడట.

మార్కండేయులు యింటి కొచ్చేశాడు. పెద్దకర్మ అయిపోయేదాకా ఆగి ఉదయమే వెళ్ళి "ఆ పొగాకు యిస్తే వ్యాపారం పెట్టుకుంటా" నన్నాడు. "మా చిన్నాన్న ఆశ్చర్యపోయి. నవ్వుకొని. అంతలో ఆలోచించి "ఎంతిస్తావు?" అన్నాడట — గవర్నమెంటు ఉద్యోగి కనుక అలవాటు ప్రకారం.

"అమ్మితే మూడో వంతు యిస్తా" నన్నాడు. సరుకు తీసుకుని సరాసరి విజయనగరంలో దిగాడు. మనిషిని పెట్టి మొదట్లో చుట్టలు చుట్టించాడు. అన్నట్టు - దుకాణానికి 'ఠాకూర్ రాణీ చుట్టల దుకాణం' అని పేరు పెట్టాడు. ఒక సంవత్సరం పాటు మా చిన్నాయనకి వాటా యిచ్చి కొత్త సరుకు తెప్పించి అమ్మాడు. స్థిరపడ్డాడు. ఇప్పుడు తనే వెళ్ళి సరుకు తెచ్చుకుంటున్నాడు. దుకాణం చూశాను. వ్యాపారం మూడు పువ్వులూ. ఆరు కాయలుగా సాగుతూండడంలో సందేహం లేదు.

"ఆ రోజు నిస్సహాయంగా తప్పించుకోడానికి నోటికొచ్చిన మొదటి అబద్ధం చెప్పాను. కాని జీవితంలో వద్దనుకొంటూ చెప్పిన ఒకే ఒక్క అబద్ధం యిది రెండేళ్ళ తరవాత అదే నిజమయింది" అన్నాడు.